క్లుప్తంగా

విద్యుత్ చార్జీలను తగ్గించాలి

కల్లూరు: కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్, సర్దుబాటు చార్జీలను తగ్గించాలని సీపీఐ కర్నూలు జిల్లా కార్యవర్గ సభ్యులు కె. జగన్నాథం డిమాండ్ చేశారు. శనివారం నగర సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు అధ్యక్షతన కల్లూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాది కాలంలో విద్యుత్ బిల్లులు దడ పుట్టిస్తున్నాయన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలన్నారు. అదానీతో జరిగిన విద్యుత్ ఒప్పందాలను రద్దుచేయాలన్నారు. ప్రభుత్వం విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై భారం మోపిందన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రమిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఆంజనేయులు, రవి, మాధవి, ఇమాంబీ, అబ్రహం, బాబయ్య తదితరులు పాల్గొన్నారు.

8న సర్వసభ్య సమావేశం

కోడుమూరు రూరల్ : మండల సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 8వ తేదీన స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రాముడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ గాడి రూతమ్మ ఆధ్వర్యంలో జరిగే సర్వసభ్య సమావేశానికి మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచులు, అన్ని శాఖల అధికారులు హాజరవ్వాలని కోరారు. అధికారులు తమ తమ శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలతో రావాలన్నారు.

పోరాటాలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న సీపీఐ మండల కార్యదర్శి రాజు

కోడుమూరు రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ మండల కార్యదర్శి రాజు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో పార్టీ నాయకుల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నాయన్నారు. రాష్ట్రంలో సీఎం చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయకపోవడంతో ప్రజలు, రైతులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. ఇకనైనా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు చిన్న రాముడు, నాగరాజు, శేషుకుమార్, బజారి, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఎంటీఎస్‌లే దిక్కు!


ఎస్ కొత్తూరు గ్రామంలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఎంటీఎస్ ఉపాధ్యాయురాలు

పాణ్యం : కూటమి ప్రభుత్వ హయంలో విద్యా వ్యవస్థలో ముందస్తు ప్రణాళిక లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం బదిలీలు చేపట్టగా పలు చోట్ల ఇంకా రెగ్యులర్ ఉపాధ్యాయులు రాకపోవడంతో ఎంటీఎస్ (మినిమమ్ టైమ్ స్కెల్) ఉపాధ్యా యులు పాఠాలు బోధిస్తున్నారు. పాణ్యం మండలంలో 5 పాఠశాలలో రెగ్యులర్ ఉపాధ్యాయులు రాకపోవడంతో ఎంటీఎస్‌లే పాఠాలు బోధిస్తున్నారు. ఎస్ కొత్తూరు పాఠశాలలో 20మంది విద్యార్థులు ఉన్నారు. గగ్గటూరు -32, అహల్యాపురం-19, అనుపూరు-15మంది చొప్పున విద్యార్థులు ఉన్నారు. ఉన్న ఒక్కరు కూడా వివిధ వివరాలు యాప్‌లో నమోదు చేయడానికి, ఇతర కార్యకలాపాలు చూడడానికి సరిపోతుంది. దీంతో విద్యాబోధనలకు ఆటంకంగా మారింది. ప్రభుత్వం ఇప్పటికైన త్వరగా ఉపాధ్యాయులను నియమించాలని తల్లిందండ్రులు కోరుతున్నారు.

హాస్టల్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీ

కర్నూలు(అర్బన్): నగరంలోని ఇందిరాగాంధీ నగర్ ఎస్సీ కళాశాల బాలుర వసతి గృహంలో శనివారం విద్యార్థులకు వండిన పదార్థాలను, సరుకులను ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో ఫుడ్ సెక్రెటరీ రాజగోపాల్ పాల్గొని స్టోర్ రూమ్‌లోని సరుకులను, వండిన ఆహార పదార్థాలను శాంపిల్స్ తీసకున్నారు. వీటిని నాణ్యత ప్రమాణాల సేకరణ కోసం గుంటూరు రీజినల్ ల్యాబ్‌కు పంపుతామన్నారు. నవ్యాంధ్ర జేఏసీ, మా ల విద్యార్థి సంఘం ఫిర్యాదు మేరకు తనిఖీలు నిర్వహించారు. జేఏసీ అధ్యక్షుడు అయ్యస్వామి, మాల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె. వెంకటేష్, డీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు శరత్‌కుమా ర్, విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యులు ప్రభుదాస్ పాల్గొన్నారు.

వైఎస్‌ఆర్‌సీపీలో నియామకాలు

కర్నూలు టౌన్: వైఎస్‌ఆర్‌సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శులుగా మహబుబ్‌బాషా, నాసీర్ బాషాలు నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం రాత్రి ఆ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఓ ప్రకటన విడుదలైంది. అలాగే వైఎస్‌ఆర్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులుగా రామకృష్ణ, కిషన్‌లు నియమితులయ్యారు.

అభివృద్ధి అధోగతి!

- ఓర్వకలుల్లో అభివృద్ధికి నోచుకోని ప్రధాన రహదారి
- నిలిచిన మురుగు కాల్వల నిర్మాణ పనులు
- స్థల వివాదం, కూటమి నాయకుల రాజకీయ విబేధాలే కారణం
- రోడ్డు నిర్మాణాల పేరుతో చిరు దుకాణాల తొలగింపు
- రోడ్డున పడిన వ్యాపారులు

ఓర్వకల్లు : మండల కేంద్రం ఓర్వకల్లు గ్రామంలోని ప్రధాన రహదారి దశాబ్దాలు గడిచినా అభివృద్ధికి నోచుకోవడం లేదు. రహదారికి ఇరువైపులా ఇటీవల చేపట్టిన మురుగునీటి కాల్వ నిర్మాణ పనులు ముందుకు సాగడంలేదు. అధికారుల అనాలోచిత నిర్ణయాలు, రాజకీయ నాయకుల మధ్య లోపించిన సఖ్యత, మధ్యలో తలెత్తిన స్థల వివాదం వెరసి ఆగమేఘాలపై చేపట్టిన నిర్మాణ పనులు అర్థంతరంగా నిలిచిపోయాయి. దీంతో గ్రామస్తులకు, వాహనదారులకు అవస్థలు తప్పడంలేదు. దుకాణాలు తొలగించడంతో చిరువ్యాపారులు జీవనోపాధి కోల్పోయారు.

బురద మయంగా రహదారి

గ్రామంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి మిడుతూరు వైపు వెళ్లే ప్రధాన రహదారికి దశాబ్దాల నుంచి బీటీ రోడ్డు నిర్మించకపోవడం, ఇరువైపులా డ్రైనేజీ కాల్వలు లేకపోవడంతో వర్షపు నీటితో బురదమయంగా మారింది. నిత్యం పదుల సంఖ్యలో భారీ వాహనాలు తిరగడంతో మరింత దెబ్బతిని రోడ్డుపై అక్కడక్కడ ఏర్పడిన గుంతలు వర్షపునీటితో దర్శనమిస్తున్నాయి. వర్షం కురిసినప్పుడు పాదచారులు, ద్విచక్ర వాహనదారులు, ఆ రహదారిపై వెళ్లేందుకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. దీనంతటికి ప్రధాన కారణం డ్రైనేజీ కాల్వలు లేకపోవడమేనని స్థానికుల నుంచి విమర్శలు తలెత్తుతున్నాయి.


రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

వైఎస్సార్ విగ్రహం తొలగింపునకు కుట్ర

రోడ్డుకు వైపున కొంత దూరంలో నెలకొల్పిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని కాల్వ నిర్మాణంలో భాగంగా కూల్చేందుకు కూటమి నాయకులు కుట్ర పన్నినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏది ఏమైనా పనులు త్వరగా పూర్తి చేసి ఇ బ్బందులు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

చిరు వ్యాపారాలను తొలగించి

గ్రామంలోని ప్రధాన రహదారిపై తోపుడు బండ్లు, చిన్నపాటి బంకులు పెట్టుకొని కొందరు వ్యాపారం చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు. స్థానిక బస్టాండు నుంచి మర్రిచెట్టు వరకు పదుల సంఖ్యలో వివిధ రకాల వ్యాపారాలు చేసుకుంటూ చిరు వ్యాపారులు జీవనం సాగిస్తున్నారు. కాగా, రోడ్డు, డ్రైనేజీ నిర్మాణం పేరుతో అధికారులు బస్టాండు సమీపంలో రోడ్డుకు ఇరువైపులా వ్యాపారాలను తొలగించారు. దీంతో సదరు వ్యాపారులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. తోపుడు బండ్ల వ్యాపారులు సర్వీసు రోడ్డు పైకి వచ్చి వ్యాపారాలు నిర్వహిస్తుండగా, బంకుల్లో వ్యాపారం చేస్తున్న వారు వ్యాపారాలకే స్వస్తి పలికారు. రోడ్డు ఎప్పుడు వేస్తారో? డ్రైనేజీ కాల్వల నిర్మాణం పూర్తికావడానికి ఎంత సమయం పడుతుందోననే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.


నిలిచిపోయిన డ్రైనేజీ నిర్మాణ పనులు

గత ప్రభుత్వంలో సీసీ రోడ్డు నిర్మాణం

ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సుమారు రూ.45 లక్షలతో దాదాపు కిలోమీటరు మేర సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. గ్రామంలోని మర్రి చెట్టు వద్ద నుంచి పింజరిగేరి వరకు రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో వాహనదారులు, పాదచారులు చాలా ఇబ్బందులకు గురయ్యేవారు. ప్రజల సౌకర్యార్థం గత ప్రభుత్వంలో 20 అడుగుల వెడల్పుతో సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. మర్రి చెట్టు నుంచి బస్టాండ్ వరకు బీటీ రోడ్డు నిర్మించాలని ప్రతిపాదనలు పంపడం జరిగింది. ఆ లోగా సార్వత్రిక ఎన్నికలు రావడంతో రోడ్డు నిర్మాణం పెండింగ్‌లో పడిపోయింది. ప్రస్తుత ప్రభుత్వం బీటీ రోడ్డు నిర్మాణాన్ని గాలికొదిలేసి, మొక్కుబడిగా రోడ్డుకు ఇరువైపుల డ్రైనేజీల నిర్మాణం చేపట్టారు.


గత ప్రభుత్వంలో నిర్మించిన సీసీ రోడ్డు

తెరపైకి స్థల వివాదం

ప్రధాన రహదారిపై వర్షపునీరు నిల్వవుండడంతో డ్రైనేజీ కాల్వలు నిర్మిస్తే కొంత మేరకు సమస్య పరిష్కారమవుతుందని భావించి వైఎస్సార్‌సీపీ నాయకులు, స్థానిక జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు రూ.10 లక్షలు జెడ్పీ నిధులు కేటాయించారు. ఈ నిధులను గ్రామంలోని ప్రధాన రహదారి అభివృద్ధి ఖర్చుచేయాలని తీర్మానించారు. ఈ నేపథ్యంలో అధికారులు ముందుగా డ్రైనేజీ పనులు చేపట్టే బాధ్యతలు కూటమి నాయకులకు అప్పగించారు. దీంతో కూటమి నాయకులు అధికార బలంతో నాలుగు నెలల క్రితం రోడ్డు పక్కనున్న బంకులను తొలగించేసి కాల్వ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఇందులో బస్టాండ్ నుంచి మర్రిచెట్టు వరకు ఎడమవైపున 168 మీటర్ల పొడవునా కాల్వ నిర్మాణ పనులను పూర్తి చేశారు. కుడివైపు 85 మీటర్ల దూరంలో వున్న గోపాలయ్య బంకు వరకు నిర్మాణ పనులు కొనసాగాయి. కానీ అక్కడికి వచ్చేలోగా స్థల వివాదం తెరపైకి తెచ్చారు. ఈ విషయంలో కూటమి నాయకుల మధ్య తలెత్తిన రాజకీయ విభేదాల కారణంగా కాల్వ నిర్మాణ పనులు నిలిపివేసినట్లు తెలుస్తుంది. ఈ విషయంలో అధికారులు కల్పించుకొని సర్ది చెప్పినా ప్రయోజనం లేకపోయింది.

స్థల వివాదం, కార్మికుల కొరతే కారణం

వైఎస్సార్ విగ్రహం ప్రధాన సమస్య కాదు. కూటమి నాయకునికి చెందిన బంధువుల స్థల వివాదం, పనులు చేపట్టే కాల్వ నిర్మాణ కార్మికుల కొరతతోనే పనులు నిలిచిపోవడానికి ప్రధాన కారణం. ఇప్పటి వరకు చేపట్టిన 168 మీటర్ల నిర్మాణ పనులకు , 138 మీటర్ల చెందిన పనులకు రూ. 5 లక్షల బిల్లు మంజూరుకు ప్రతిపాదనలు పంపాం.

– శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేద్దాం


కలిసొద్దాం కార్యకర్తను కార్యక్రమంలో మండల కన్వీనర్ మోహన్ బాబు, వైస్ ఎంపీపీ నెహెమ్యా

కర్నూలు (రూరల్) : వైఎస్సార్‌సీపీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేద్దామని ఆ పార్టీ మండల కన్వీనర్ పేరపోగు మోహన్ బాబు, కర్నూలు మండల వైస్ ఎంపీపీ నెహెమ్యా పిలుపునిచ్చారు. మండల పరిధిలోని దిన్నెదేవరపాడు గ్రామంలో శనివారం 'కలిసొద్దాం కార్యకర్తను' కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలన్నారు. అనంతరం గ్రామ కమిటీలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకుడు, గ్రామ కమిటీ అధ్యక్షుడు బోయ రామరాజు, ప్రధాన కార్యదర్శులు చిన్న ఆదిశేషన్న, రాజగోపాల్, రాముడు, పి.చిన్న బడెన్న, ఎం.శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మొరాయించిన తీర్థయాత్ర బస్సు

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజుపల్లె గ్రామం వద్ద శనివారం జాతీయ రహదారిపై ఓ తీర్థయాత్ర బస్సు మరమ్మతులకు గురై నిలిచిపోయింది. ఆలస్యమవుతుండటంతో సహనం నశించిన భక్తులు పాణ్యం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ నరేంద్ర కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు హైదరాబాదు నుంచి అరుణాచలం వెళ్తున్న ఓ ట్రావెల్ బస్సు తమ్మరాజుపల్లె వద్ద బ్రేక్‌కు సంబంధించిన సమస్య రావడంతో నిలిచిపోయింది. ఆలస్యమవుతున్నా యాజమాన్యం పట్టించుకోకపోవడంతో పోలీసుల దృష్టికి తీసుకువచ్చారన్నారు. బస్సులో సుమారు 30 మంది వరకు భక్తులు ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు. బస్సును ఆర్టీఓకు అప్పగించినట్లు వెల్లడించారు.

పది గంటల పనివిధాన తీర్మానం దారుణం


మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు

కోడుమూరు రూరల్ : కేంద్రం తెచ్చిన లేబర్ కోడ్లలో భాగంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పది గంటల పని విధానాన్ని అమలు చేయాలని తీర్మానించడం దారుణమని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు విమర్శించారు. శనివారం గూడూరు సీఐటీయూ కార్యాలయంలో డివిజన్ కార్యదర్శి మోహన్ అధ్యక్షతన నాయకుల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ కార్మికులు ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రద్దు చేస్తూ నూతన కార్మిక కోడ్లను అమలు చేయాలని నిర్ణయించడం దారుణమన్నారు. కార్మికులను బానిసలుగా మార్చే లేబర్ కోడ్లను రద్దు చేయాలని కోరుతూ ఈనెల 9న నిర్వహిస్తున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక సీఐటీయూ నాయకులు గుంటప్ప, వెంకటేశ్వర్లు, దానమన్న, రామాంజినేయులు, గజ్జలన్న, భారతి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి


కోడుమూరులో ఐసీడీఎస్ సిబ్బందికి సమ్మె నోటీసు అందజేస్తున్న అంగన్‌వాడీలు

కోడుమూరు రూరల్: అంగన్‌వాడీ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీసం వేతనం రూ.26వేలను అందించాలని సీఐటీయూ మండల కార్యదర్శి వీరన్న డిమాండ్ చేశారు. లేబర్ కోడ్ల రద్దు, అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం వంటి డిమాండ్లతో ఈనెల 9న చేస్తున్న సమ్మెకు సంబంధించి నోటీసును శనివారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో అంగన్‌వాడీ వర్కర్లు సమర్పించారు. వీరన్న మాట్లాడుతూ అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడంతో పాటు, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ జీవో ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ సభ్యురాళ్లు సుజాత, చంద్రమ్మ, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

ఓర్వకల్లు : మండలంలోని హుసేనాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పూడిచెర్ల గ్రామంలో శనివారం వైద్యాధికారిని డాక్టర్ శిరీష ఆధ్వర్యంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో టీబీ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలో రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, రాత్రి పూట చమటలు, బరువు తగ్గిపోవడం, 60 ఏళ్లకు పైబడిన వారు పొగ తాగడం, మద్యం సేవించడం, పౌష్టికాహార లోపం ఉన్న వారు గళ్ల పరీక్షలు, ఎక్స్‌రేలు చేయించుకోవాలని సూచించారు. నిరుపేద టీబీ రోగులకు గ్రామ స్థాయిలో దాతల సహకారంతో ప్రతి నెలా పౌష్టికాహారం అందించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో మహిళ ఆరోగ్య పర్యవేక్షకురాలు సిలువ జ్యోతి, టీబీ సూపర్ వైజర్ నిషిత్, ల్యాబ్ టెక్నిషియన్ ఇమ్రాన్, మేల్ హెల్త్ అసిస్టెంట్ రాజేంద్ర, ఆరోగ్య కార్యకర్త లలిత తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో తప్పనిసరిగా చెత్త సేకరించాలి


గ్రామంలో చెత్త సేకరణపై ఆరా తీస్తున్న జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి

ఓర్వకల్లు: అన్ని గ్రామ పంచాయతీలలో ఉదయాన్నే తప్పనిసరిగా చెత్త సేకరణ కార్యక్రమాన్ని చేపట్టాలని జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కాల్వ గ్రామ పంచాయతీని సందర్శించారు. ఆయన మాట్లాడుతూ.. స్వచ్ఛ భారత్‌లో భాగంగా పారిశుద్ధ్య కార్మికులు ప్రతి రోజు ఉదయం ఇంటింటికి తిరిగి తడి, పొడి చెత్తను సేకరించాలని సూచించారు. గ్రామంలో ఇంటి పన్నులు, కుళాయి పన్నులు సక్రమంగా చెల్లిస్తున్నారా?, ప్రతి ఇంటికి మరుగు దొడ్డి నిర్మించుకున్నారా?, గ్రామంలో బహిరంగ మల విసర్జన జరుగుతుందా? అనే అంశాలపై గ్రామస్తులను ఆరాతీశారు. పొడి చెత్త, తడిచెత్తను వేరుచేసి పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి సురేష్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కోనా వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు


పూజలందుకుంటున్న స్వామి, అమ్మవార్లు

సి.బెళగల్: మండల పరిధిలోని క్రిష్ణదొడ్డి కొండపై వెలసిన కోనా వేంకటేశ్వర స్వామి వారికి శనివారం పూజారులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. స్వామివారికి ప్రియమైన రోజు కావడంతో కొండపై ఆలయంలోని భూదేవి, అలివేలి మంగమ్మ సమేత స్వామి వారి మూల విగ్రహాలకు అభిషేక పూజలతో పాటు ప్రత్యేక పుష్ప, పత్రాలతో అలంకరించి పూజా కార్యక్రమాలను చేపట్టారు. కొండపై గ్రామస్తులు, భక్తులు స్వామివారి ప్రసాదంతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నిందితుడు అనారోగ్యంతో మృతి

కర్నూలు : తక్కువ ధరకే బంగారం విక్రయిస్తామంటూ మోసానికి పాల్పడిన నెల్లూరు జిల్లా కావలి పట్టణం వెంగలరావు నగర్‌కు చెందిన పోతురాజు శాంతి పవన్ కుమార్ అలియాస్ వసంత్ (59) అనారోగ్యంతో శనివారం మృతిచెందాడు. విజయవాడలోని సూర్యారావు పేట బద్రి హైట్స్ అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న డాక్టర్ రాజేంద్రప్రసాద్‌ను ఏడుగురు నిందితులు కలసి తక్కువ ధరకే బంగారం విక్రయిస్తామని నమ్మించారు. అతని నుంచి రూ.7.32 కోట్లను బ్యాంకు ద్వారా నగదు రూపంలో తీసుకుని మోసగించారు. ఈ ఏడాది మార్చిలో కర్నూలులోని ఓ లాడ్జిలో నిందితులు ఉండగా బాధితుడు డాక్టర్ రాజేంద్రప్రసాద్ వారిని కలసి తన డబ్బులు తిరిగి ఇవ్వాలని నిలదీశాడు. నిందితులు చంపేస్తామని బెదిరించి అతని వద్ద ఉన్న రూ.50 వేలను దౌర్జన్యంగా లాక్కున్నారు. దీంతో బాధితుడు కర్నూలు మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా జూన్ 18వ తేదీన కేసు నమోదు చేసి నిందితులను గత నెల 30వ తేదీన అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించారు. కర్నూలు శివారులోని జిల్లా జైలులో ఉన్న పోతురాజు శాంతి పవన్ కుమార్ కిడ్నీ సమస్యతో తీవ్రంగా బాధ పడుతుండటంతో శుక్రవారం ఆసుపత్రికి తరలించి వైద్యచికిత్సలు చేయించగా కోలుకోలేక మృతిచెందాడు. మూడో పట్టణ పోలీసులు అనుమానాస్పద కేసు కింద నమోదు చేసి విచారిస్తున్నట్లు సమాచారం.

ఆటో డ్రైవర్‌ను ఆదుకోవాలి

కర్నూలు(హాస్పిటల్): కలెక్టరేట్‌లో ఆటోపై చెట్టు పడి వాహనం దెబ్బతినడంతో పాటు గాయాలకు గురైన ఆటో డ్రైవర్‌ను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. ప్రభాకర్, న్యూసిటీ ప్రధాన కార్యదర్శి బి. రాధాకృష్ణ కోరారు. శనివారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఆటో డ్రైవర్‌ను వారు పరామర్శించారు. స్థానిక రాజీవ్ గృహకల్పలో నివాసముండే ఓంకారయ్య కలెక్టర్ కార్యాలయంలోని ఎస్‌బీఐ బ్యాంకులో విధులు నిర్వహించే ఓ ఉద్యోగినిని ప్రతిరోజూ ఆటోలో తీసుకొచ్చి, మళ్లీ ఇంటికి తీసుకెళ్లే క్రమంలో శుక్రవారం ఈ ప్రమాదం జరిగిందన్నారు. ప్రమాదంలో ఓంకారయ్య తలకు గాయం కావడంతో పాటు ఆటో పూర్తిగా దెబ్బతిందన్నారు. అనంతరం వారు డీఆర్‌ఓ సి.నారాయణమ్మను కలిసి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఆటో నాయకులు చంద్రశేఖరయ్య, జి.సత్యనారాయణరెడ్డి, కె.సుబ్బయ్య పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కల్పించాలి

కర్నూలు(సెంట్రల్): నగరంలోని 15వ వార్డు బుధవారపేట మహిళలకు రక్షణ కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎన్‌జీ కృష్ణ డిమాండ్ చేశారు. శనివారం కేవీపీఎస్ 15వ వార్డు మహిళ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వార్డులో అసాంఘిక కార్యక్రమాలను నివారించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో నాటు సారా, బంగి, గంజాయి సేవిస్తూ యువత పెడదోవ పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసుల నిఘాలేకపోవడంతో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని చెప్పారు. అనంతరం మహిళా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా కళావాతి, రేణుకను ఎన్నుకున్నారు.

ఘనంగా చిన్న సరిగెత్తు


చిన్న ఇమాం ఖాశీంను ఊరేగిస్తున్న భక్తులు


ప్రత్యేక అలంకరణలో పెద్దస్వామి

సి.బెళగల్: మండల పరిధిలోని గ్రామాలలో శుక్రవారం రాత్రి, శనివారం తెల్లవారు జామున ప్రజలు మొహర్రం వేడుకలలో భాగంగా చిన్న సరిగెత్తును ఘనంగా నిర్వహించుకున్నారు. మండల కేంద్రం సి.బెళగల్‌లో చిన్న ఇమాంఖాశీం పీర్లకు, గొల్లలదొడ్డి గ్రామంలో చందమామయ్య పీర్ల చావిడీలలో శుక్రవారం రాత్రి భక్తులు మొక్కులు చెల్లించున్నారు. అలాగే శనివారం వేకువ జామున సి.బెళగల్‌లో భక్తులు చిన్న ఇమాం ఖాశీం పీరును గ్రామంలో ఊరేగించారు. పీర్ల దేవుళ్లను తెల్లవారుజామున 4 గంటలకు మసీద్ నుంచి బయటకు తీసుకెళ్లి, కోట వీధిలో ఉన్న దస్తగిరయ్య స్వాముల దర్గాలో చదింపులు చేశారు. అదేవిధంగా తెలుగు వీధిలో ఉన్న సుంతానమ్మ, పెద్ద దేవుడి, కంతమలయ్య చావిడీలలో చదింపులు చేసి, గ్రామంలో ఊరేగించి పాత బస్టాండ్‌లో సవారిని నిర్వహించారు. ఉదయం ఎనిమిది గంటల అనంతరం పీర్ల దేవుళ్లను మసీద్‌లలో తిరిగి ప్రతిష్ఠించారు. ఇనగండ్ల, బ్రాహ్మణదొడ్డి, పోలకల్, బురాన్‌దొడ్డి గ్రామాలలో కూడా భక్తులు మొహర్రం ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు.

నేడు పెద్ద సరిగెత్తు

మొహర్రం వేడుకలలో భాగంగా మండలంలోని గ్రామాలలో ఆదివారం పెద్ద సరిగెత్తు వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆయా గ్రామాల పెద్దలు, ఉత్సవ నిర్వాహకులు తెలిపారు.

పెద్దస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే

పాణ్యం: మండల పరిధిలోని గోరుకల్లు గ్రామంలో మొహర్రం సందర్భంగా కొలవుదీరిన పెద్దస్వామి స్వామి పీర్లను ఎమ్మెల్యే గౌరు చరిత దర్శించుకున్నారు. మొహర్రం సందర్భంగా శనివారం నిర్వహించిన బండలాగుడు పోటీలను ప్రారంభించారు. అంతకు ముందు స్వామి వారికి ప్రత్యేక ఫతేహాలు సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్, పెస్టిసైడ్ దుకాణాలపై విజిలెన్స్ దాడులు


సి.బెళగల్లో ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్లోని ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, వ్యవసాయ అధికారులు దాడులు నిర్వహించారు. రికార్డులు సరిగాలేకపోవడంతో దాదాపు రూ.2 లక్షలు విలువ చేసే ఎరువులను సీజ్ చేశారు.విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ పవన్‌కుమార్, విజిలెన్స్ వ్యవసాయ అధికారి విశ్వనాథ్, మండల ఏఓ మల్లేష్‌కుమార్‌తో కలిసి సి.బెళగల్లోని ఓం శ్రీ మురళీసాయి, ఓం శ్రీ నాగసాయి ఏజెన్సీల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ రెండు ఫర్టిలైజర్ దుకాణాల్లో 113 యూరియా బస్తాలు, 20.20.0.13 (ఫ్యాక్ట్) 115 బస్తాలను సీజ్ చేశారు. అనంతరం విజిలెన్స్ అధికారులు మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు విక్రయించాలన్నారు. అలాగే వాటిని అధిక ధరలకు అమ్మినట్లు తెలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

తేలని వీఏఏల బదిలీలు!

- మార్పులు, చేర్పులపై కూటమి పార్టీల నేతల నుంచి పెరుగుతున్న సిఫార్సులు
- జాప్యంతో ఆందోళనలో వీఏఏలు

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయ శాఖలో వీఏఏల బదిలీల వ్యవహారం గందరగోళంగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత నెల 29 నుంచి కసరత్తు చేస్తున్నప్పటికీ ఇంతవరకు కొలిక్కి రాకపోవడం పట్ల వీఏఏల్లో ఆందోళన పెరిగిపోతోంది. రాజకీయ సిఫార్సుల కారణంగా బదిలీల్లో ఏదో జరిగిపోతుందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి రెండు రోజుల కిందటే బదిలీల లిస్ట్ విడుదల చేసినప్పటికి అనేక తప్పులు, పొరపాట్లు ఉండటంతో వాటిని హోల్డ్‌లో పెట్టారు. తప్పొప్పులను సరిచేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నా కొలిక్కి రావడం లేదు. ఇటీవల ఏమో, ఏడీఏల బదిలీల్లో గతంలో ఎప్పుడూ లేని విధంగా రాజకీయ పైరవీలు జరిగాయి. బదిలీల్లో రాజకీయ జోక్యం పెరిగిపోవడం, ముడుపులు రాజ్యమేలడంతో వ్యవసాయ శాఖ పరువు బజారున పడింది. తాజాగా వీఏఏల బదిలీల్లోనూ.. పైరవీల పర్వం నడుస్తుందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కూటమి పార్టీల నేతల నుంచి మార్పులు, చేర్పులపై సిఫార్సులు వస్తుండటంతో అధికారులు అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నారు. దీని వల్ల తమకు ఎక్కడ అన్యాయం జరుగుతుందోనని వీఏఏలు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో కొందరు ఉద్యానశాఖ సహాయకులు జిల్లా కలెక్టర్‌ను కలిసి తమకు జరుగుతున్న అన్యాయంపై వినతిపత్రం అందజేశారు. సీనియార్టీని పరిగణనలోకి తీసుకోలేదని, ఉమ్మడి జిల్లా కౌన్సెలింగ్ నిర్వహించలేదని, ఖాళీల పూర్తి వివరాలు ప్రదర్శించకుండా రెండుమూడు ఆప్షన్లు మాత్రమే ఇచ్చారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

రూ.2.42 కోట్ల స్వాహాతో సంబంధం లేదట!

- విలేకరులతో కర్నూలు అర్బన్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ మాజీ చైర్మన్ బాలరాజు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు అర్బన్ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీలో రూ.2.42 కోట్ల స్వాహా వ్యవహారంతో తమకు సంబంధం లేదని మాజీ చైర్మన్ ఎ.బాలరాజు తప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా నిధుల స్వాహా నెపమంతా సీఈఓగా వ్యవహరించిన రఫీక్, క్యాషియర్ జాకీర్‌బాషాపై నెట్టారు. శనివారం అర్బన్ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీలో జరిగిన నిధుల స్వాహాపై ఆయన కలెక్టరేట్‌లోని మీడియా పాయింట్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించి తనతో పాటు పాలకవర్గం తప్పు లేదని చెప్పుకొచ్చారు. అంతే కాదు 2019–20లో క్యాష్ బుక్‌లు తనిఖీ చేయగా... రూ.10 లక్షలు దుర్వినియోగం అయినట్లు తేలిందని, డైలీ డిపాజిట్‌ల సేకరణకు వినియోగించే కార్డుల స్థానంలో నకిలీ కార్డులు వినియోగించి రూ.44.82 లక్షలు స్వాహా చేసినట్లు 2021–22 ఆడిట్‌లో తేలిందని చెప్పారు. 2019–20 నుంచే అక్రమాలకు పాల్పడుతున్నప్పుడు చైర్మన్‌గా బాలరాజుకు సర్వాధికారాలు ఉండి కూడా వెంటనే వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది.